UNIVERSITY OF CAMBRIDGE INTERNATIONAL EXAMINATIONS
General Certificate of Education
Advanced Subsidiary Level and Advanced Level

**TELUGU** **8690/02**
**9690/02**

Paper 2 Reading and Writing **October/November 2007**

**1 hour 45 minutes**

Additional Materials: Answer Booklet/Paper

**READ THESE INSTRUCTIONS FIRST**

If you have been given an Answer Booklet, follow the instructions on the front cover of the Booklet.
Write your Centre number, candidate number and name on all the work you hand in.
Write in dark blue or black pen.
Do not use staples, paper clips, highlighters, glue or correction fluid.

Answer **all** questions.
Write your answers in **Telugu** on the separate answer paper provided.
Dictionaries are **not** permitted.
You should keep to any word limits given in the questions.

At the end of the examination, fasten all your work securely together.
The number of marks is given in brackets [ ] at the end of each question or part question.

**ఈ సూచనలను ముందుగా చదవండి.**

మీకిచ్చిన ప్రత్యుత్తర పత్రంలోని ముఖపత్రం మీది సూచనలను పాటించండి.

మీరు అందించే ప్రత్యుత్తరపత్రం/పత్రసంపుటి మీద మీపేరు, కేంద్రం సంఖ్య, అభ్యర్థి సంఖ్య రాసి నింపండి.

రాయడానికి ముదురునీలం లేదా నలుపురంగు సిరాకలాలనే వాడండి.

స్టేపిల్సు, పేపరు క్లిప్పులు, హైలైటర్లు, గ్లూ లేదా చెరుపుడు ద్రవాలు వాడకండి.

**అన్ని** ప్రశ్నలకు జవాబులు రాయండి.

అందించిన ప్రత్యుత్తరపత్రంలో మీ జవాబులను **తెలుగులో** రాయండి.

పదకోశాలకు అనుమతి **లేదు**.

ప్రశ్నల్లో సూచింపబడ్డ పదపరిమితిని పాటించండి.

పరీక్షకాగానే ప్రత్యుత్తర పత్రాలన్నిటినీ ఒకటిగా గుదికూర్చి కట్టండి.

ప్రతిప్రశ్నకు లేదా ప్రశ్నాంశానికి చివర కుండలీకరణం [ ] గుర్తుల్లో గుణములు సూచింపబడ్డవి.

This document consists of **6** printed pages and **2** blank pages.

SP (NH/SP) T32442/2
© UCLES 2007
UNIVERSITY of CAMBRIDGE International Examinations

**[Turn over**

## విభాగం 1

ముందుగా ఈ మొదటిపాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగులో** జవాబులు రాయండి.

### ఒక ఉజ్వల ఘట్టం

భారతదేశ స్వాతంత్ర్యంకోసం జాతీయ కాంగ్రెస్ ఏవిధంగా ఆవిర్భవించిందో, ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆంధ్ర మహాసభ ఆవిధంగానే ఆవిర్భవించింది.

ఆంధ్రమహాసభ మొదటి సమావేశం 1913లో గుంటూరుజిల్లా బాపట్లలో బి.ఎన్.శర్మ అధ్యక్షతన జరిగింది. దీనికి దేశభక్త కొండా వెంకటప్పయ్య ఆహ్వానసంఘాధ్యక్షులు. ప్రముఖులు వేమవరపు రామదాసు పంతులు మరియు ఎనిమిది వందల మంది ప్రతినిధులు యీ సభలో పాల్గొన్నారు.

రెండవ ఆంధ్రమహాసభ 1914 ఏప్రిల్ నెలలో న్యాపతి సుబ్బారావు పంతులు అధ్యక్షతన బెజవాడలో జరిగింది.

1800 సం.లో నిజాం నవాబు తన రాజ్యంలోని బళ్ళారి, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలను ఈస్టిండియా కంపెనీకి దత్తం చేశాడు. 1911లో చిత్తూరుజిల్లా ఏర్పడిన తరువాత ఈ అయిదు జిల్లాలను కలిపి దత్తమండలం అని వ్యవహరించారు. ఈ పేరులో ఆకర్షణ లేదని భావించి గాడిచర్ల హరిసర్వోత్తమరావు దీనికి రాయలసీమ అని నామకరణం చేశారు. నెల్లూరు జిల్లాను ఆర్కాటు నవాబు నుంచి ఈస్టిండియా కంపెనీ వారు 1801లో తీసుకున్నారు. అందుచేత ఆ జిల్లా సర్కార్లలోగాని, రాయలసీమలోగాని కలవలేదు. సమిష్టి నామధేయంగా మిగిలింది. సర్కార్లతో కలిసి కోస్తాజిల్లా అన్నారు.

సర్కారు, రాయలసీమ నాయకుల మధ్య అపోహలను తొలగించడానికి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా డా.పట్టాభి 1937 నవంబరు 14వ తేదీన మద్రాసులో నాయకుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశం కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు నివాసం 'శ్రీబాగ్'లో జరిగింది కనుక దీన్ని 'శ్రీబాగ్ ఒడంబడిక' అన్నారు. సర్కార్ల పక్షాన డా. పట్టాభి, కొండా వెంకటప్పయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, మహబూబ్ అలీబేగ్, దేశిరాజు హనుమంతరావు, ముళ్ళపూడి పళ్ళంరాజు, రాయలసీమ పక్షాన పప్పూరి రామాచార్యులు, టి.ఎన్. రామకృష్ణారెడ్డి, కల్లూరి సుబ్బారావు, దేశపాండ్య సుబ్బారావు, హలిహర్వ సీతారామరెడ్డి, కడపకోటిరెడ్డి పాల్గొని ఒడంబడిక చేసుకున్నారు.

ప్రత్యేక ఒరిస్సా రాష్ట్రాన్ని ఏర్పరచుకున్నప్పుడు కమీషన్ సిఫారసుమీద విశాఖ జిల్లాకు చెందిన ఛత్రపురం, బరంపురం, పర్లాకిమిడి తాలూకాలు, పర్లాకిమిడి ఏజెన్సీ కూడా ఒరిస్సాలో చేరాయి. కడపజిల్లాలోని కొన్ని భాగాలు, నార్త్ ఆర్కాట్ జిల్లాలోని తెలుగు తాలూకాలను చాలామట్టుకు చేర్చి మద్రాసు ప్రభుత్వం 1911లో చిత్తూరుజిల్లాను ఏర్పరచింది. సేలం జిల్లాలోని హోసూరు, కృష్ణగిరి, నార్త్ అర్కాట్ జిల్లాలోని వాలాజీ, ఆర్కోణం, గుడియాత్తం మొదలైనవి చిత్తూరుజిల్లాలో చేర్చలేదు. ఈ విధంగా రాష్ట్రం నిర్మాణంలో జరిగిన ఆలస్యం తెలుగువారికి నష్ట కారణమైంది.

1947 ఆగష్టు 15న దేశానికి స్వాతంత్ర్యం లభించింది. ఆ సంవత్సరం సెప్టెంబరులో జరిగిన కాంగ్రెస్‌పార్టీ సమావేశంలో ఆంధ్రరాష్ట్ర నిర్మాణం చర్చకు వచ్చింది. గవర్నరు పాలిత ప్రాంతాలు, సంస్థానాలు ఏకం చేయడం రాజ్యాంగపరంగా సాధ్యమయ్యేపనికాదు కనుక మద్రాసురాష్ట్రంలోని 11 తెలుగు జిల్లాలతో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుచేసుకోవచ్చునని ప్రధాని నెహ్రూ అభిప్రాయపడ్డారు. ఒక్క తెలుగురాష్ట్రమే ఎందుకు? తమకు కూడా ప్రత్యేకరాష్ట్రం కావాలన్నారు కన్నడిగులు. ఆంధ్రరాష్ట్ర పోరాటం అఖిలభారత సమస్యగా మారి భాషా రాష్ట్రాల నిర్మాణానికి కారణమైంది.

ఆంధ్రమహాసభ చివరి సమావేశం 1951లో గుంటూరులో జరిగింది. అప్పటినుంచి ఇది ఉద్యమస్థాయికి మారింది. మహాసభలు జరిగిన స్థలాలు, అధ్యక్షులు పేర్లను పరిశీలిస్తే, పార్టీ విభేదాలు ప్రాంతీయ విభేదాలు

© UCLES 2007

లేకుండా ఆంధ్రులందరూ ఈ ఉద్యమంలో పాల్గొన్నవారే. పొట్టి శ్రీరాములుగారి ఆత్మార్పణంతో 1953 అక్టోబరు 1వ తేదీన కర్నూలు రాజధానిగా ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.

తెలంగాణా ప్రజలలో సర్వతోముఖమైన చైతన్యం సృష్టించడానికి ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు ప్రోత్సాహంతో 1921లో ఆంధ్రజనసంఘం ఏర్పడి తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడింది. రైతు, వర్తక సంఘాలను నెలకొల్పింది. వీటన్నింటికీ ఒక కేంద్ర సంఘంగా 1931లో నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఆంధ్ర మహాసభలతోపాటు ఆంధ్ర మహిళా సభలు జరిగాయి.

హైదరాబాద్ సంస్థానంలో జాతీయోద్యమం ఇక్కడి పరిస్థితుల కనుగుణంగానే భాషాప్రయుక్తంగా ఉద్భవించింది. హైదరాబాద్ సంస్థాన కాంగ్రెస్ అధ్యక్షులు స్వామీ రామానందతీర్థ మొదటి నుంచి భాషా రాష్ట్రవాది. దాదాపు రెండు వందల సంవత్సరాలు నవాబు పాలనలో ఉంటూ, మహారాష్ట్ర జిల్లాలతో స్నేహం చేసినప్పటికీ, తెలంగాణా సిరి సంపదలల్లో, జీవనగతిలో అచ్చముగా తెలుగు భూభాగంగానే మిగిలింది. తెలుగు ప్రత్యేకతను తెలంగాణా ఎన్నడూ విస్మరించి ఎరుగదు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడగానే వివిధభాషలు మాట్లాడే ప్రజలున్న అవాస్తవిక రాష్ట్రాలను పునర్నిర్మాణం చేసి, భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పరచాలనే ప్రజా ఆందోళనలు దేశమంతటా ఉవ్వెత్తున లేచాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పరచడానికి ఫజల్ అలీ అధ్యక్షతన కేంద్రప్రభుత్వం ఒక కమీషన్‌ను నియమించింది. ఈ కమీషన్ సిఫారసుల ఆధారంగా హైదరాబాద్ రాష్ట్రంలోని మరాఠీ మాట్లాడే జిల్లాలు మహారాష్ట్రలోను, కన్నడం మాట్లాడే జిల్లాలు కర్నాటకలోను తెలుగు మాట్లాడే తెలంగాణా జిల్లాలు ఆంధ్రరాష్ట్రంలోను కలిసిపోయాయి. 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది.

**1** దిగువ పేర్కొన్న అర్థవివరణలకు బాగా సరిపోయిన పదాలు/పదబంధాలు మీది పాఠ్యంలో ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.

మాదిరి : ఆవిర్భవించింది

ఉత్తరం : ఆవిరిగా మారింది ( ); పుట్టింది (✔); కరుడుగట్టింది ( ).

(అ) *దత్తమండలం* : కమండలం ( ); ఇవ్వబడ్డ ప్రాంతం ( ); పంచపాత్ర ( ) [1]

(ఆ) *అపోహలు* : అనుమానాలు ( ); అవమానాలు ( ); మంచి భావనలు ( ) [1]

(ఇ) *ఒడంబడిక* : ఒడిలో పడడం ( ); భక్ష్యవిశేషం ( ); ఒప్పందం ( ) [1]

(ఈ) *ఆత్మార్పణం* : స్వీకారం ( ); శరీరత్యాగం ( ); మనస్ఫూర్తిగా ( ) [1]

(ఉ) *ఉవ్వెత్తున* : ఎక్కువగా ( ); ఆకాశంమీద ( ); అలలు ( ) [1]

[మొత్తం గుణములు 5]

**2** కింది గీట్లు గలవాటిని ప్రశ్నించినవిధంగా భాషారూపాలను మార్చి, వాక్యాలను సరిచేసి రాయండి.

మాదిరి : సమావేశం బాపట్లలో జరిగింది. (క్రియాపదాన్ని ప్రశ్నార్థకంగా మార్చి రాయండి.)

ఉత్తరం : సమావేశం బాపట్లలో జరిగిందా?

(అ) స్వాతంత్ర్యంకోసం జాతీయకాంగ్రెస్ ఏవిధంగా ఆవిర్భవించిందో రాష్ట్రసాధనకోసం ఆంధ్రమహాసభ ఆవిధంగానే ఆవిర్భవించింది. (ఈ వాక్యంలోని "ఏవిధంగా - ఆవిధంగానే" అనే నిర్మాణానికి బదులుగా "ఆవిర్భవించినట్లు" అనే పదాన్ని ఉపయోగించి మార్చి రాయండి. [1]

(ఆ) జాతీయోద్యమం (సంధి విడదీసి రాయండి.) [1]

(ఇ) సిరిసంపదలు (ఈ సమాసాన్ని సరిగా విడదీసి రాయండి.) [1]

(ఈ) ఆంధ్రరాష్ట్ర పోరాటం అఖిలభారత సమస్యగా మారి, భాషారాష్ట్రాల నిర్మాణానికి కారణమైంది.
(ఈ వాక్యాన్ని రెండు సంపూర్ణ వాక్యాలుగా విడదీసి రాయండి) [1]

(ఉ) కేంద్ర ప్రభుత్వం ఒక కమిషన్‌ను నియమించింది.
(ఏర్పాటు అనే పదాన్ని ఉపయోగించి వాక్యాన్ని మార్చి రాయండి.) [1]

[మొత్తం గుణములు 5]

3 మీది పాఠ్యంలోని వాక్యాలనే మక్కికిమక్కీ దించకుండా కింది ప్రశ్నలకు **తెలుగు**లో మీసొంత వాక్యాలలో ప్రత్యుత్తరాలు రాయండి.
(ప్రతి ప్రశ్న చివర గుణములు గుర్తించబడ్డాయి. భాషాపాటవానికి అదనంగా 5 గుణాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15 + 5 = 20 గుణములు).

(అ) ఈపాఠ్యంలో ఆంధ్రమహాసభవారి సమావేశాలు మొత్తం ఎన్ని జరిగినట్లు తెలుస్తున్నది. [2]

(ఆ) ఇందులో ఆంధ్రమహాసభవారి తుదిసమావేశం ఎక్కడ జరిగినట్లుగా ఉన్నది?
అది ఎప్పుడు జరిగింది? [2]

(ఇ) దత్తమండలంగా మొదట గుర్తింపబడ్డ జిల్లాలు ఏవి? వాటికాపేరు ఎట్లా సార్థకమైంది? [3]

(ఈ) రాయలసీమ అనేపేరును వ్యాప్తికి తెచ్చినవారు ఎవరు? 'దత్తమండలం' అనే పేరులోకన్నా 'రాయలసీమ' అనే పేరులో గల ఆకర్షణ ఏమిటో వివరించండి. [4]

(ఉ) శ్రీబాగ్ ఒడంబడిక అనే పేరు ఎందుకు వచ్చింది? అప్పటి సమావేశాన్ని ఏర్పాటుచేసినవారెవరు? ఎందుకు చేశారు? [4]

భాషాపాటవానికి : 5

[మొత్తం గుణములు 20]

© UCLES 2007

## విభాగం 2

ఇప్పుడు ఈ దిగువనున్న రెండోపాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగు**లో జవాబులు రాయండి.

### అందాలతోట

ఆదిమానవుడు ఆనందాశ్చర్యాలతో వేసిన గంతులే నృత్యానికి నాంది అయి ఉంటుందని చెప్పవచ్చు. జంతువులను అనుకరిస్తూ అతడు వేసిన 'కూత' తొలిమాటకు ఆరంభం. వాటిని అనుకరిస్తూ ఇతరులకు తెలియజెప్పడం అనే ప్రక్రియ తొలి కళారూపాలకు మొదటి దశ. అవి కళారూపంగా, జనరంజకంగా, ప్రదర్శనకు యోగ్యంగా మారడానికి వందల సంవత్సరాలు వినిమయం అయివుంటాయి.

ఈవిధంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రదేశాల్లో, అన్ని జాతుల్లో ఎన్నో జానపద కళారూపాలు పుట్టుకొచ్చాయి. అలాగే దక్షిణభారతదేశంలో పలు కళారూపాలు ఉద్భవించాయి. అలాంటి కళారూపాల్లో 'తోలు బొమ్మలాట' ఒకటి. ఈ కళారూపం మరాఠా ప్రాంతంలో పుట్టినా, తెలుగు ప్రదేశాల్లో వ్యాప్తితో బహుళ ప్రాచుర్యానికి నోచుకుంది.

తోలుబొమ్మలాట వివిధ రూపాంతరాల తర్వాత ఈ దశను చేరుకుందని పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కీలుబొమ్మలు, ఊచబొమ్మలు వంటి ప్రక్రియలనుండి 'తోలు బొమ్మలాట'గా ఒక పరిపూర్ణమైన దశను సంతరించుకుని ఉంటుందని చెప్పవచ్చు. ఈ తోలుబొమ్మలాటకు ఆధునికపు మరోపేరు 'ఛాయాచర్మ చిత్రనాటకం'. తోలుబొమ్మలాట ఆంధ్రుల ఖ్యాతిని ఖండఖండాంతరాలకు వ్యాపింప చేసిన గ్రామీణ వినోదం. అందుకే "తొంబయి ఆమడలు వెళ్ళైనా తోలుబొమ్మలాట చూడాలి" అన్న నానుడి ప్రజల్లో స్థిరపడిపోయింది.

ఈ తోలుబొమ్మలు ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీముని పట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడ్రేవు, కొత్త పట్నాలనుంచి విదేశాలకు భారతీయులతో పాటు వెళ్ళాయి.

అదేవిధంగా అక్కడినుండి పర్షియా, టర్కీల మీదుగా గ్రీకు దేశంలో ప్రవేశించి గ్రీకులో నూతన రూపం ధరించుకుని ఉత్తరాఫ్రికాలోని ముస్లిందేశాలకు, అదేవిధంగా 17వ శతాబ్దంలో ఇటలీకి, అక్కడినుండి ఫ్రాన్స్, వెర్సయిల్స్, పారిస్, పేలేరాయల్‌కు వ్యాపించాయని చెప్పవచ్చు. ఈ తోలుబొమ్మలు కాలానుగుణంగా ఆయాదేశాల్లో భిన్నరూపాలు ధరించినప్పటికీ, భారతదేశం వీటికి మాతృక అని చెప్పవచ్చు.

ఇంతటి గొప్పచరిత్ర కలిగిన తోలుబొమ్మల తయారీ కష్టంతో కూడుకున్నది. వీటి తయారీకి జింక, దుప్పి, మేక తోళ్ళను వాడతారు. చైనాలో గాడిద చర్మంతోను, గ్రీకుదేశంలో ఒంటె చర్మంతోను తోలుబొమ్మలను తయారుచేస్తారు. రంగులచే తోలుబొమ్మలకు ఇరువైపుల రంగులు వేస్తారు. ప్రస్తుతం ఆధునికులు ట్రాన్స్‌పరెంట్ కలర్స్ ఉపయోగిస్తారు.

తోలుబొమ్మల ప్రదర్శనకు వస్తే, రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమినుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈవిధంగా కట్టడంవల్ల బొమ్మలను ఆడించేటప్పుడు బొమ్మలకాళ్ళు అడ్డుతగలకుండా ఉంటుంది. తోలుబొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. అయితే విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు.

తోలుబొమ్మలాట వంశపారంపర్యంగా వస్తున్న ఒక కళాసంస్కృతి. వేల సంవత్సరాలుగా మౌఖికంగా వస్తూ జానపదుల గుండెల్లో గూడుకట్టుకున్న ఉత్కృష్టమైన కళాప్రక్రియ. రామాయణ, మహాభారత, భాగవత కథను అలవోకగా చెప్పే తోలుబొమ్మల కళాకారుల మాతృభాష 'మరాఠీ' అంటే ఆశ్చర్యం కలిగించక మానదు. మహారాష్ట్ర నుండి వలస వచ్చిన ఈ కళారూపం ఆంధ్రదేశంలో ఒక ప్రముఖ కళారూపంగా అభివృద్ధిచెంది తెలుగుసంస్కృతిలో మిళితమై మన జాతీయ సంపదకే వన్నె తెచ్చింది.

4 కింది ప్రశ్నలకు **తెలుగు**లో జవాబులు రాయండి. పాఠ్యంలోని వాక్యాంశాలనే మక్కికి మక్కీ దించకుండా మీ సొంత వాక్యాలలో రాయండి.

(ప్రతి ప్రశ్న చివర గుణములు గుర్తించబడ్డాయి. భాషాపాటవానికి అదనంగా 5 గుణములు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15+5=20 గుణములు.)

(అ) ఈ పాఠ్యంలో కళావిర్భావాన్ని గురించి, దాని ప్రయోజనంగురించి మీరేమి తెలుసుకున్నారు? [3]

(ఆ) తోలుబొమ్మలాటకు గల మరో పేరేమిటి? దానినిబట్టి ఆ కళారూపాన్ని గూర్చి మీరేమి తెలుసుకుంటున్నారు? [3]

(ఇ) తోలుబొమ్మలాట ఎక్కడ పుట్టింది? ఎక్కడ వృద్ధిచెందింది? ఎట్లా వ్యాప్తిచెందింది? వివరించండి. [5]

(ఈ) తోలుబొమ్మలాట కళారూపాన్ని రూపొందించడాన్నిగూర్చి వివరించండి? [2]

(ఉ) తోలుబొమ్మలాట ప్రదర్శన విధానంగురించి మీరు తెలుసుకున్న విషయాన్ని వివరించండి? [2]

భాషాపాటవానికి : 5

[మొత్తం గుణములు 20]

5 కింది ప్రశ్నకు **తెలుగు**లో జవాబు రాయండి. మీ ప్రత్యుత్తరం 140 పదాలపరిమితికి మించరాదు.

పై రెండు పాఠ్యాలను చదివినతరువాత ఆంధ్రుల భాషా సాంస్కృతిక చైతన్యాన్ని గూర్చిన మీ స్పందనను వివరించండి. [15]

భాషాపాటవానికి : 5

[మొత్తం గుణములు 20]

**BLANK PAGE**

**BLANK PAGE**

*Copyright Acknowledgements:*

Passage 1 © G. Venkata Rama Rao; *Andhra Pradesh Vol IV* - Issue 6, November 2003.
Passage 2 © K. Vijay Kumar; *Andhra Pradesh Vol IV* - Issue 6, November 2003.

Permission to reproduce items where third-party owned material protected by copyright is included has been sought and cleared where possible. Every reasonable effort has been made by the publisher (UCLES) to trace copyright holders, but if any items requiring clearance have unwittingly been included, the publisher will be pleased to make amends at the earliest possible opportunity.

University of Cambridge International Examinations is part of the Cambridge Assessment Group. Cambridge Assessment is the brand name of University of Cambridge Local Examinations Syndicate (UCLES), which is itself a department of the University of Cambridge.